క్రీడలతో ఐక్యత పెరుగుతుంది

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

క్రికెట్‌లో గెలుపొందిన ఎస్పీ లెవెన్ టీమ్

ఆసిఫాబాద్, మార్చి3 : క్రీడలతో ఐకమత్యం పెరుగుతుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు ఆదివారంతో ముగిశాయి. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో ఎస్పీ లెవెన్ టీమ్ గెలుపొందింది. ఆర్మ్‌డ్ పోలీస్ టీమ్ రన్నర్‌గా నిలిచింది. ఎస్పీ మాట్లాడుతూ వాలీబాల్, బాడ్మింటన్, క్రికెట్ పోటీల్లో విజేతలకు త్వరలో హెడ్ క్వార్టర్స్‌లో జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, సీఐలు రాణాప్రతాప్, సతీశ్, శ్రీనివాస్, ఎస్ఐలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం..

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం నాయకులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే పురాణం సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి చౌరస్తాలో నిర్మిస్తున్న ఈ భవనంలో పై రెండు అంతస్తులకు పర్మిషన్ లేదు

మార్కెట్ రోడ్‌లో సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న భవనం, ఇందులో పై అంతస్తు నిర్మాణానికి అనుమతి లేదు

అనధికార అంతస్తులు.. ఆపేదెవరు?

- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి భారీ భవంతులు
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు

మంచిర్యాల, మార్చి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో అనధికార బిల్డింగ్‌ల నిర్మాణాలు ఎక్కువయ్యాయి. నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా భారీ భవంతులు కడుతుండగా, టౌన్‌ప్లానింగ్ అధికారులు నామమాత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తున్నది. మున్సిపల్ నిబంధనల ప్రకారం రోడ్డు పక్కన బిల్డింగ్‌లు నిర్మించేవారు సెట్ బ్యాక్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, అవేవీ పట్టించుకోకుండా 10 ఫీట్లు, 20 ఫీట్లు ముందు కొచ్చి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. బెల్లంపల్లి చౌరస్తాలో నిర్మితమవుతున్న ఓ భారీ భవంతిపైన రెండు అంతస్తులకు అనుమతులు లేవు. కోర్టు పక్కన మారుతీనగర్, అశోక్‌రోడ్, ఓల్డ్ గర్మిళ్ల, మార్కెట్ ఏరియాలో నిర్మిస్తున్న భవనాల్లో అదనపు అంతస్తులకు ఎలాంటి పర్మిషన్లు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు. ఇలా మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిల్లో ఎన్నో వీధుల్లో అక్రమ నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్ వింగ్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో సకాలంలో స్పందించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. నోటీసులు ఇచ్చినా నిర్మాణాలు చేస్తున్న వారి నుంచి ఎలాంటి స్పందన లేదని పేర్కొంటున్నారు. మరోవైపు అధికారుల తీరుపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. పొట్టకూటి కోసం రోడ్డు పక్కన టేలాలు, బండ్లు పెట్టుకొని బతికే చిరు వ్యాపారులను తొలగించాలని ఇబ్బంది పెట్టే అధికారులు.. అనుమతులు లేకుండా భారీ భవంతులు కడుతున్న పెద్దలను మాత్రం ఏమీ అనడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు స్పందిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

నిబంధనలు రెడ్‌క్రాస్

ఎన్నికల నోటీసుపై సమాచారమే లేదంటున్న సభ్యులు

- నామినేషన్ల విత్‌డ్రా ఫామ్‌లపై తేదీ మార్చినట్లు ఆరోపణలు
- పూర్తిస్థాయి విచారణ చేసి, ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

మంచిర్యాలలోని రెడ్ క్రాస్ సొసైటీ

మంచిర్యాల, మార్చి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజలకు సేవ చేసే రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో రాజకీయ నాయకుల జోక్యం.. ఇప్పుడు మంచిర్యాలలో చర్చనీయాంశమైంది. మార్చి 3న నిర్వహించాల్సిన ఎన్నికలు వాయిదా పడడం వెనుక పెద్ద కుట్రే జరిగిందని సొసైటీలో శాశ్వత సభ్యత్వం కలిగిన కొందరు ఆరోపిస్తున్నారు. తొలుత నామినేషన్లు వేసిన 32 మందిలో.. ఫిబ్రవరి 25న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఇంట్లో నిర్వహించిన సమావేశానికి హాజరైంది కేవలం 22 మందే అని విశ్వసనీయ సమాచారం. ఇద్దరు స్థానికంగా అందుబాటులో లేనప్పటికీ వారు డీసీవో(డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్)కు నామినేషన్లు విత్‌డ్రా చేసుకుంటున్నట్లు మెయిల్ చేశారని.. మిగిలిన వారికి చెప్పినట్లు తెలిసింది. మిగిలిన వారిలో కొందరి దగ్గరికెళ్లి సంతకాలు తీసుకోగా, మరికొందరిని అసలు పరిగణలోకే తీసుకోలేదట. 25న పీఎస్సార్ ఇంట్లో మీటింగ్ జరిగినప్పుడు నామినేషన్ల విత్‌డ్రా ఫారాలపై మాత్రం 24వ తేదీ వేసి సంతకాలు తీసుకున్నట్లు కొందరు చెబుతున్నారు. వాటినే తీసుకెళ్లి 25వ తేదీన కలెక్టరేట్ కార్యాలయంలో సమర్పించినట్లు సమాచారం. దీని వెనక జరిగిందేమిటో తెలుసుకోకుండా అధికారులు హడావుడిగా ఎన్నికలను వాయిదా వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డీసీవో పాత్రపై అనుమానాలు..

రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల అధికారిగా ఉన్న డీసీవో(డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్) ఏకపక్షంగా వ్యవహరించారని కొందరు సభ్యులు మండిపడుతున్నారు. తొలిసారి ఎన్నికలకు ముందు శాశ్వత సభ్యులందరికీ ఎన్నికలు ఉంటాయని, మీరంతా ఏజీఎం(వార్షిక సర్వసభ్య సమావేశానికి) రావాలని సమాచారం ఇచ్చారు. ఎన్నికలపై పత్రికల్లో ప్రకటనలు సైతం చేశారు. కానీ రెండోసారి ఎన్నికలు వాయిదా పడిన విషయం, ఎన్నికల నోటీసు విడుదల చేసిన విషయం సభ్యులెవ్వరికీ చెప్పలేదంటున్నారు. అది తెలిస్తే మరోసారి నామినేషన్లు వేసేవాళ్లమని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండోసారి ఎన్నికల షెడ్యూల్ వచ్చాక నామినేషన్లు వేసిన 15 మంది ఏకగ్రీవం అయినట్లు ఇప్పటికే ప్రచారం చేసుకుంటుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో డీసీవో నిబంధనలకు విరుద్ధంగా వ్యహరించారని ఆరోపిస్తున్నారు. దీనిపై డీసీవో నర్సయ్యను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు. రెడ్‌క్రాస్ సొసైటీకి బాధ్యులుగా ఉన్న కలెక్టర్ ఈ విషయాలను పరిశీలించి, అందరి సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నాకే ఎన్నికలు నిర్వహించాలని సభ్యులు కోరుతున్నారు. పీఎస్సార్ చెప్పారో లేదో తమకు తెలియదు కానీ.. సొసైటీలో కొందరు కాంగ్రెస్ నాయకులు పీఎస్సార్ జోక్యంతోనే ఎన్నికలు ఏకగ్రీవమవుతున్నాయని చెప్పారంటున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పీఎస్సార్ సైతం క్లారిటీ ఇవ్వాలని, ఆయన పేరు చెప్పే సరికి తాము ఎటూ తేల్చుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛందంగా నడిచే సొసైటీలో ఇప్పటికైనా రాజకీయాలు చేయొద్దని వేడుకుంటున్నారు.

ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- ఎంసీహెచ్‌లో కార్యక్రమం ప్రారంభం

మంచిర్యాలలోని ఎంసీహెచ్‌లో అప్పుడే పుట్టిన శిశువుకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలటౌన్, మార్చి 3 : ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం ఉదయం మంచిర్యాలలోని ఎంసీహెచ్‌లో శిశువుకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పట్టణాలు, గ్రామాల్లో దవాఖానలు, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలియో రహిత సమాజ స్థాపన కోసం అందరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బారాయుడు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ అనిత, ఎంసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, వైద్యులు ముస్తాఫా, ప్రశాంతి, అరుణశ్రీ, వైద్య సిబ్బంది నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, బుక్య వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అభిజిత్‌ను బతికించరూ..

బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఆరేళ్ల బాలుడు

- ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జేలో చికిత్స
- ఆపరేషన్ కోసం రూ.10 లక్షలు అవసరం
- దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు

ఫోన్ పే-గూగుల్ పే : 8008264439, ఎస్బీఐ అకౌంట్ నంబర్ : 20155788028 (ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్బీఐఎన్0012967)

అభం శుభం తెలియని ఆ ఆరేళ్ల బాలుడికి పెద్దకష్టమే వచ్చింది. బ్రెయిన్ ట్యూమర్‌తో హాస్పిటల్‌లో చేరగా, వైద్యమందించే స్థోమత లేని అతడి తల్లిదండ్రులు దాతల కోసం ఎదురుచూస్తున్నారు. తోచిన సాయమందించి తమ బాబును బతికించాలని చేతులెత్తి వేడుకుంటున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అభిజిత్

దండేపల్లి, మార్చి 3 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లక్ష్మీకాంతాపూర్ గ్రామానికి చెందిన ఈర్ల సతీశ్-మౌనిక దంపతులకు ఇద్దరు కుమారులు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లారు. సతీశ్ అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం చేసుకుంటుండగా, భార్య గృహిణిగా పిల్లలను చూసుకుంటుంది. గతేడాది దసరా పండుగకు స్వగ్రామానికి రాగా, రెండో కుమారుడు అభిజిత్ (6) ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆపై హైదరాబాద్‌కు వెళ్లి గాంధీ దవాఖానలో చూపించారు. సిటీ స్కాన్ చేసి పరీక్షలు నిర్వహించగా బ్రెయిన్ ట్యూమర్‌గా డాక్టర్లు నిర్ధారించారు. దీంతో ఒక్కసారిగా వారి జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. నవంబర్ 3న గాంధీ హాస్పిటల్‌లో చిన్న ఆపరేషన్ చేశారు. అనంతరం ఉస్మానియాకు రెఫర్ చేయగా, అక్కడ మరోసారి సర్జరీ చేసి బ్రెయిన్ ట్యూమర్‌గా గుర్తించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే బాలుడి వైద్యానికి రూ.లక్ష వరకు ఖర్చు కాగా, పూర్తి స్థాయిలో కోలుకోవాలంటే మరో రూ.10 లక్షలు అవసరమని డాక్టర్లు చెప్పడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలెవ్వరైనా ముందుకు వచ్చి వైద్యానికి భరోసా ఇవ్వాలని బాలుడి తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. ఫోన్ పే-గూగుల్ పే : 8008264439(ఈర్ల సతీష్), ఎస్బీఐ అకౌంట్ నంబర్ : 20155788028(ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్బీఐఎన్0012967)లకు సాయం పంపాలని వేడుకుంటున్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సింగరేణి రిటైర్డ్ అధికారులు, మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు

సింగరేణి రిటైర్డ్ అధికారుల ఆత్మీయ సమ్మేళనం

సీసీసీ నస్పూర్, మార్చి 3: సీసీసీలోని సింగరేణి ఎస్సీవోఏ క్లబ్‌లో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే-7గని అధికారులు, మైనింగ్ స్టాఫ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. 1976 నుంచి మార్చి-2024 వరకు రిటైర్డ్ అయిన గని అధికారులు, మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సంస్థలో పని చేసి రిటైర్డ్ అయిన అధికారులు, ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనానికి వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం రిటైర్డ్ సింగరేణి డైరెక్టర్ భాస్కర్‌రావు ఆర్‌కే-7గనిలో పని చేసిన అనుభూతులు, అనుభవాలను గుర్తుచేశారు. సింగరేణిలోనే అతిపెద్ద భూగర్భ గని ఆర్‌కే-7 అని.. ఇందులో పనిచేసిన అధికారులందరూ ఉన్నత స్థానంలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, రిటైర్డ్ సీజీఎం బానోత్ చంద్రు, రిటైర్డ్ జీఎంలు రాంరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వీరస్వామి, రిటైర్డ్ డీజీఎం ఆర్‌సీబీ రాజ్, ఆర్‌కే-7 గ్రూప్ ఏజెంట్ రాముడు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ పాం లక్ష్యం కష్టమే..!

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 1048 ఎకరాల్లో వేయాలని టార్గెట్

- ప్రస్తుతం 129 ఎకరాలతోనే సరి
- కేసీఆర్ సర్కారులో అన్ని విధాలా ప్రోత్సహం
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సాగుకు బ్రేక్



ఆయిల్ పాం తోట

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈ ఏడాది మార్చినెలాఖరుకల్లా 1048 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అది నెరవేరే పరిస్థితి కనబడటం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో 23 మంది రైతులతో 129 ఎకరాల్లో మాత్రమే తోటలు సాగు చేయించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో వంద శాతం టార్గెట్‌ను పూర్తిచేసేలా అధికారులు ప్రణాళికలు అమలు చేసినప్పటికీ ఆచరణ సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో మార్చిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. కష్టంగామారింది. అధికారులు తోటలను విస్తరించే దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

కేసీఆర్ సర్కారులో ప్రోత్సాహం

రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేందుకు కేసీఆర్ సర్కారు జిల్లాలో ఆయిల్ పాం తోటల పెంపకాన్ని ప్రోత్సహించింది. రైతులను నష్టాలు లేని సాగువైపు మళ్లించేందుకు ఆయిల్ పాంలను పెద్ద మొత్తంలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంది. మాట్రిక్స్ అనే ప్రైవేట్ కంపెనీకి బాధ్యతలు అప్పగించడంతోపాటు మొక్కల సరఫరాలో రైతులకు సబ్సిడీని అందించింది. ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులకు మొక్కలను సరఫరా చేసేందుకు మంచిర్యాల జిల్లాలోని భీమారంలో ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటు చేశారు. ఒక్కో మొక్క ఖరీదు రూ. 213 ఉండగా, రూ. 193 సబ్సిడీని అందించారు. అంతేకాకుండా ఆసక్తి ఉన్న రైతులకు రూ. లక్ష విలువగల డ్రిప్‌లను అందజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 23 మంది రైతులకు డ్రిప్‌లను ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో ఇవ్వగా, ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్‌లను అందిస్తూ ప్రోత్సహించింది. దీంతో రైతులు ఆయిల్‌పాం సాగుకు ముందుకు వచ్చారు. ఇంతలో ఎన్నికలు రావడం.. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆయిల్‌పాం తోటల విస్తరణ సందిగ్ధంలో పడింది. దాదాపు 30 ఏళ్ల పాటు ఆదాయాన్నిచ్చే ఈ పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

సాగుకు బ్రేక్

మార్కెట్‌లో ఆయిల్ పాంకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు చేపట్టిన ప్రాథమిక సర్వేల ప్రకారం జిల్లాలో సుమారు 3 వేల ఎకరాలు ఆయిల్ పాం సాగుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా జిల్లాలో 1048 ఎకరాల్లో తోటలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విడుతల వారీగా ఆయిల్ పాం తోటలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఇప్పటికే 129 ఎకరాల్లో విస్తరించారు. మార్చిలోగా టార్గెట్ పూర్తిచేసేందుకు రైతులకు అవగాహన కల్పించి భూములను సిద్ధం చేసినప్పటికీ, కొత్త ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో ఆయిల్‌పాం సాగుకు బ్రేక్ పడింది.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్,మార్చి 3 : 2024-25 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వుల మేరకు హైదరాబాద్‌లోని బేగంపేట్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోండు, నాయక్ పోడ్, పర్దాన్ (3), కొలాం/ఆంధ్ (1), లంబాడా (1).. ఇతర గిరిజనులకు (1) మొత్తం 6 సీట్లకుగాను ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను లక్కీ డీప్ పద్ధతిన ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతంలో రూ. 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు ఉండాలని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ ధ్రువీకరణ పత్రం మీ-సేవ ద్వారా జారీ చేయబడి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు జూన్ 1, 2017 నుంచి మే 31, 2018 మధ్య జన్మించి ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం సంబంధిత అధికారులతో జారీ చేసి ఉండాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరిచి ఈ నెల 11వ తేదీలోగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో అందించాలని సూచించారు. ఈ నెల 14న విద్యార్థుల ఎంపిక జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

కాసిపేట, మార్చి 3 : మండలంలోని దేవాపూర్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. దేవాపూర్‌లోని షైక్ నైమ ఇంటిని అద్దెకు తీసుకొని, అందులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేయగా, 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. ముత్యంపల్లికి చెందిన ఎండీ తాజ్ దేవాపూర్ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బియ్యం అప్పగించారు.